

మాఫీ, భరోసా అమలుకు ధర్నా

రుణమాఫీ, రైతుభరోసా అమలుచేయాలనే డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.

10లో



రైతువేదికకు తాళం

బోనకల్ మండలంలో పంట నష్టపరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ రైతువేదికకు నాయకులు తాళం వేశారు.

10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 22°

జిల్లాలో మంగళవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత గంటగంటకు చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మం వన్‌టౌన్/మధిర/ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30 గంటలకు బోనకల్ మండలం రావినూతలలో పలువురితో సమావేశమయ్యాక గ్రామంతో పాటు మధిర మండలంలోని సిరిపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం మధిరలో ఇందిరా డెయిరీ లోగోను ఆవిష్కరించి మహిళా సంఘాల సభ్యులతో సమావేశమవుతారు. అనంతరం మధిర మండలం మాటూరులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం, సాయంత్రం ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

మంత్రి పొంగులేటి..

ఖమ్మం వన్‌టౌన్/తిరుమలాయపాలెం: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళ, బుధవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలం బీరోలులో చెరువు ఆధునికీకరణ పనులను ప్రారంభించనున్న మంత్రి గోల్‌తండాలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాక తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు జెడ్పీహెచ్‌ఎస్‌ల్లో పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తారు. ఆతర్వాత బారుగూడెం, కరుణగిరి రాజీవ్‌గృహకల్ప కాలనీ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఇక బుధవారం ఖమ్మం దానవాయిగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాక కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి తిరుమలాయపాలెం మండలంలో అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తారు. అనంతరం రాత్రి 7 గంటలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో విజేతలకు మంత్రి బహుమతులు అందజేస్తారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌ఓ చందన్‌కుమార్

కూసుమంచి: ప్రభుత్వం ఆధ్వర్యాన ఏర్పాటుచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీఎస్‌ఓ) చందన్‌కుమార్ సూచించారు. మండలంలోని కిష్టాపురంలో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ఐకేపీ ఏపీఎం సత్యవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డి



నర్సింహారావు

ఖమ్మం సహకారనగర్: పలు జిల్లాల అదనపు కలెక్టర్లతో పాటు డీఆర్వో, ఆర్డీవో హోదా అధికారులను ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి.మధుసూదన్ నాయక్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ స్థానంలో సిద్దిపేట అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డిని నియమించారు. అలాగే, నిర్మల్ ఎస్‌డీసీ వి.భుజంగరావును ఖమ్మం డీఆర్వోగా నియమించగా, ఖమ్మం ఆర్డీఓ గుంటుపల్లి గణేష్‌ను తొర్రూరుకు, అక్కడి నుంచి జి.నర్సింహారావును ఖమ్మంకు బదిలీ చేశారు.

ఇంటింటి సర్వేకు కసరత్తు

జిల్లాల వారీగా జనాభా లెక్కలు ఖరారు చేసేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపడుతోంది. వచ్చే నెల మొదటి వారం నుంచి సర్వే మొదలుకానుండగా జిల్లా జనాభా అధికారికంగా తేలనుంది. ఈ సర్వే నిర్వహణకు 4 వేల మంది ఎన్యూమరేటర్లను నియమించి, నియోజకవర్గాల వారీగా పర్యవేక్షణకు ఇన్‌చార్జి అధికారులను నియమిస్తున్నారు. ఇప్పటికే సర్వేకు సంబంధించి జిల్లాకు చెందిన అధికారులు శిక్షణ నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



జనాభా లెక్కలకు 4వేల మంది ఎన్యూమరేటర్లుకు బాధ్యతలు

- నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలు కూడా..
- వచ్చే నెల మొదటి వారం నుంచి ప్రారంభం
- అధికారికంగా తేలనున్న జిల్లా జనాభా లెక్క

సుమారు 20 లక్షలు

తాజాగా సిద్ధమైన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 12,27,230 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్య ఆధారంగా జిల్లా జనాభా సుమారు 20 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. ప్రతీ పదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం జన గణన నిర్వహిస్తుండగా, చివరిసారి 2011లో జరిగింది. ఆతర్వాత 2021లో కరోనా కారణంగా ప్రక్రియ చేపట్టలేదు. దీంతో ఓటర్ల ఆధారంగానే జనాభాను పరిగణనలోకి తీసుకుంటున్నారు. కాగా, 2011 జన గణన ప్రకారం ఉమ్మడి జిల్లాలో 27,97,370 మంది జనాభా ఉన్నారు. ఇప్పటికి జన గణన చేయక పదమూడేళ్లు గడుస్తుండగా, ప్రస్తుత ఖమ్మం జిల్లాలో 20 లక్షల మంది జనాభా ఉంటారని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

ఇంటి జనాభా లెక్కలు తీసేలా..

దేశవ్యాప్తంగా జన గణన చేపట్టేందుకు ఇంకా సమయం పట్టే అవకాశముంది. దీంతో పలు రాష్ట్రాలు సంక్షేమ పథకాల అమలుకు జనాభా లెక్కలు తేల్చేందుకు సొంతంగా సర్వేలు చేయిస్తున్నాయి. ఇందులో భాగంగా మన రాష్ట్రంలోనూ వచ్చే నెల మొదటి వారంలో ఇంటింటి సర్వే మొదలుకానుంది. ఈ సర్వేకు సంబంధించి ప్రశ్నావళి ఫారం రెండు, మూడు రోజుల్లో అందుతుందని చెబుతున్నారు. జిల్లాలోని ఒక్కో ఇంట్లో ఎందరు ఉన్నారనే వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారు.

ఒక్కో నియోజకవర్గానికి ఇన్‌చార్జి

ఇంటింటి సర్వేను పర్యవేక్షించేందుకు ఐదు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఖమ్మం నియోజకవర్గానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, పాలేరుకు అదనపు డీఆర్డీఓ నూరుద్దీన్, వైరాకు డీఎల్‌పీఓ రాంబాబు, మధిర నియోజకవర్గానికి ఖమ్మం ఆర్డీఓ, సత్తుపల్లి నియోజకవర్గానికి కల్లూరు ఆర్డీఓ లఘుసాని రాజేందర్‌ను ఇన్‌చార్జిలుగా కలెక్టర్ నియమించారు. సర్వే ఎలా చేయాలి, వివరాల సేకరణపై అధికారులు హైదరాబాద్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన శిక్షణకు హాజరయ్యారు. కాగా, సర్వేలో 4 వేల మంది ఎన్యూమరేటర్లు పాల్గొననుండగా, ప్రతీ పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ పొందిన అధికారులు నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను శిక్షణ ఇచ్చాక ప్రభుత్వ ప్రకటనతో సర్వే మొదలు కానుంది.

పరిష్కారంలో ఆలస్యం ఎందుకు?



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీజ

- అధికారులపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం
- గ్రీవెన్స్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఖమ్మంకు చెందిన నందమూరి నిర్మల తనకు బోనకల్ మండలం నారాయణపురంలో ఉన్న భూమి కంటే తక్కువగా పాస్‌పుస్తకంలో నమోదైన విషయాన్ని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఫిర్యాదు చేశారు. దీంతో బోనకల్ తహసీల్దార్‌కు ఫోన్ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పూర్తిస్థాయి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. మిగతా శాఖల అధికారులు కూడా దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, సింగరేణి మండలం గేటు రేలకాయలపల్లికి చెందిన మైకా సైదులు సుజాతనగర్‌లో పత్తి విత్తనాలు కొనుగోలు చేయగా పూత, కాత రాలేదని ఫిర్యాదు చేశారు. సుమారు రూ.8లక్షలు నష్టపోయానని చెప్పారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

అర్హులైన చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్‌కు చెందిన పలువురు అధికారులు వారం రోజులుగా జిల్లాలో అధ్యయనం చేయగా సోమవారం కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లాలో శాఖలు చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న పశుగణన కార్యక్రమ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024 స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు అర్హత సాధించిన అభ్యర్థులను సర్టిఫికెట్లను మంగళ, బుధవారం పరిశీలించనున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ విభాగంలో స్కూల్ అసిస్టెంట్(తెలుగు) ఎనిమిది పోస్టులు, ఎస్‌జీటీ(తెలుగు) 27పోస్టులు ఉండగా, 1:3 నిష్పత్తిలో 105మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరి సర్టిఫికెట్లను ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో పరిశీలించనున్నట్లు తెలిపారు.

అక్రమార్కులకు ‘ఉపాధి’

కామేపల్లి: వ్యవసాయ పనులు లేని సమయాన గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అమలుచేస్తున్న ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. కామేపల్లిలో గత సంవత్సరం చేపట్టిన పనులపై సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించగా అడిషనల్ డీఆర్‌డీఓ శిరీష హాజరయ్యారు. ఈసందర్భంగా బర్లగూడెంలో ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు పనికి హాజరైనట్లు నమోదు చేసి డబ్బు చెల్లించారని, కొన్నిచోట్ల చనిపోయిన వారి పేరిట నగదు చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేయగా తనిఖీ బృందాలు మాత్రం అవన్నీ తప్పని నిర్ధారించాయి. ఇంకా కొందరి నుంచి తక్కువ పని చేసినా ఎక్కువ చెల్లిస్తామంటూ మేట్లు డబ్బు వసూలు చేసినట్లు తేలడమే కాక ఇతర అక్రమాలు బయటపడడంతో అడిషనల్ డీఆర్‌డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు కెప్టెన్‌బంజర కార్యదర్శి భాస్కర్‌కు నోటీసు జారీ చేసి గోవింద్రాల సీనియర్ మేట్లను తొలగించాలని ఆదేశించారు. ఏపీడీ వెంకటపతిరాజు పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. ఏఎంయూ పవన్, రమేష్, వెంకటపతిరాజు, ఏపీఓ శ్రీరాణి, ఎస్ఆర్‌పీ సాంబశివచారి పాల్గొన్నారు.

పంట విక్రయాల్లో దగా పడొద్దు

- దళారులను ఆశ్రయిస్తే తగ్గనున్న ధర
- నాణ్యతగా తీసుకొస్తే ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధర
- కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలపై సమాచారం ఇవ్వండి
- ‘సాక్షి’ ఫోన్ ఇన్‌లో జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం

సాక్షి ఫోన్ ఇన్



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో పత్తి, వరి పంటల సీజన్ ప్రారంభమైంది. ఈ పంటలకు కేంద్రప్రభుత్వం మద్దతు ధర ప్రకటించగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కొనుగోలు చేస్తుండగా, ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఈనేపథ్యాన నిర్దేశించిన నాణ్యత, తగిన ధ్రువపత్రాలతో కేంద్రాలకు వస్తే మద్దతు ధర దక్కుతుందని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం తెలిపారు. ఈమేరకు అవగాహన పెంచుకోవాలే తప్ప దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని రైతులకు ఆయన సూచించారు. ఈనేపథ్యాన రైతుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సూచనలు ఇచ్చేందుకు సోమవారం ‘సాక్షి’ ఆధ్వర్యాన ఫోన్ ఇన్ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సందేహాలు, డీఎంఓ అలీం సమాధానాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : పత్తిలో 12 శాతం కన్నా తేమ తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తామంటున్నారు. ప్రైవేట్ వ్యాపారులు ఇదే అదునుగా తక్కువ ధరకు అడుగుతున్నారు ?

– అళ్లకుంట భద్రయ్య, కనగాల వెంకటరావు, ముదిగొండ మండలం

జవాబు : 8–12 శాతం తేమ శాతం ఉంటేనే సీసీఐ మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది. ఇందుకోసం పత్తిని పొద్దంతా నీడలో ఆరబెట్టి, రాత్రి వేళ్ల టార్పాలిన్ కప్పి తేమ తగ్గాక తీసుకురావాలి.

ప్రశ్న : పాతర్లపాడులో సీసీఐ కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారు?

– సిరసవాడ వెంకటేశ్వర్లు, ఎలగొండ శ్రీను, తిరుమలాయపాలెం మండలం

జవాబు : పాతర్లపాడు జిన్నింగ్ మిల్లును త్వరలోనే ప్రారంభిస్తాం. రైతులు తొందరపడి దళారులకు తక్కువ ధరకు విక్రయించుకోవద్దు.

ప్రశ్న : సీసీఐ కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో పత్తి ధరలో నష్టపోతున్నాం.

– మల్లికార్జున్‌రెడ్డి, మీనవోలు

జవాబు : త్వరలోనే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. అప్పటివరకు పంటను ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది.

ప్రశ్న : తల్లాడలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తారా?

– రావు రవిప్రసాద్, రంగాపురం

జవాబు : త్వరలోనే జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోళ్లు మొదలవుతాయి. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేర్వేరుగా గ్రేడింగ్ చేసి తగిన తేమ వచ్చేలా ఆరబెట్టి తీసుకురావాలి.

ప్రశ్న : ముదిగొండ జిన్నింగ్ మిల్లులో రైతులను కావాలని ఇబ్బంది పెడుతున్నట్లుగా ఉంది.

– పోలేటి ఉపేందర్ రావు, ముదిగొండ

జవాబు : నిర్దేశిత తేమశాతం ఉన్న పత్తి తీసుకొస్తే మద్దతు ధర ఇవ్వాల్సిందే. నాణ్యమైన పత్తి కొనుగోళ్లలో ఇబ్బంది పడితే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : ధాన్యంలో తేమ పేరిట మిల్లర్లు క్వింటాకు 4 – 6 కిలోల కోత పెడుతున్నారు. పత్తిలో కూడా అలాగే జరుగుతుంది. ఈ నష్టాలపై చర్యలు తీసుకోరా?

– మునగాల రాజశేఖర్‌రెడ్డి, సిద్దినేనిగూడెం, కోసూరి వెంకటరమణ, పాలడుగు

జవాబు : నాణ్యత ప్రమాణాలతో పంట కొనుగోలు చేశాక తేమ పేరిట కోత పెట్టడం సరికాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అలా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : నేలకొండపల్లి రైతులకు మిల్లు దూరంగా ఉన్నందున స్థానిక మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి.

– కె.వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి

జవాబు : ముదిగొండలోని జిన్నింగ్ మిల్లు కొనుగోళ్లు జరుగుతున్నాయి. ముందే గుర్తించినందున అక్కడ మాత్రమే కొనుగోళ్లు ఉంటాయి.

ప్రశ్న : మిల్లుల వద్ద అధికారుల నంబర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయిస్తే సమస్యలు చెప్పడానికి వీలవుతుంది.

– సీతయ్య, కట్టుకాచారం

జవాబు : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే కాక పత్తి కొంటున్న మిల్లుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న : పత్తి అమ్మకానికి నిబంధనలు ఏమిటి?

– అంబటిపూడి పకీరయ్య, కొమ్మినేపల్లి, చింతనబోయిన కృష్ణ, సింగరాయికొండ, పాశం అప్పారావు కొణిజర్ల, వీరయ్య, ముష్టికుంట్ల

జవాబు : పత్తిలో 8శాతం నుంచి మొదలై తేమ పెరిగే ధర కాస్త తగ్గుతుంది. 12 శాతం వరకు తేమ ఉన్న పత్తినే సీసీఐ కొనుగోలు చేస్తుంది. రైతులు ఆధార్ లింక్ అయిన బ్యాంకు అకౌంట్ పత్రాలు తీసుకెళ్లాలి.

ప్రశ్న : పత్తిని ఇక్కడ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. సీసీఐ కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

– నజీర్ అహ్మద్ ముష్టికుంట్ల

జవాబు : రెండు, మూడు రోజుల్లో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. అప్పటివరకు దళారులకు అమ్మకండి.

ప్రశ్న : వరి ధాన్యంలో తేమ ఎక్కువగా ఉందని క్వింటాకు రెండు, మూడు కిలోలు కట్ చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోండి.

– నర్సింహారావు, కొమ్మినేపల్లి

జవాబు : ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తాం. అలా జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలి.

ప్రశ్న : కారేపల్లిలో పత్తి,, ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారు?

– మణికొండ నాగేశ్వరరావు, పేరిన్ని వెంకటేశ్వరరావు, సింగరేణి

జవాబు : కారేపల్లికి సంబంధించి జిన్నింగ్ మిల్లు భద్రాద్రి జిల్లా పరిధిలో ఉంది. ఆ జిల్లా అధికారుల దృష్టికి మీ అభ్యర్థనను తీసుకెళ్తాను. ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభించే అవకాశముంది.

ప్రశ్న : జిన్నింగ్ మిల్లుల్లో దళారుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. అదే రైతులు వెళ్తే కొర్రీల పేరిట నిరాకరిస్తున్నారు.

– తాటికొండ రమేష్, వల్లాపురం

జవాబు : రైతులు దళారుల మాయలో పడొద్దు. నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది. ఎక్కడైనా దళారులు తీసుకొచ్చినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి.

ఆమే.. అధికం!

- జిల్లా ఓటర్లు 12,27,230మంది
- పురుషుతో పోలిస్తే మహిళా ఓటర్లే ఎక్కువ
- నేడు ముసాయిదా విడుదల చేయనున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేపట్టగా ముసాయిదా జాబితా సిద్ధమైంది. ఈక్రమాన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం జాబితా విడుదల చేయనున్నారు. ఇప్పటికే సిద్ధమైన జాబితా ఆధారంగా జిల్లాలో మొత్తం 12,27,230మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5,91,487 మంది, మహిళలు 6,35,659 మంది, ఇతరులు 84మంది ఓటర్లు ఉన్నారని తేల్చారు. కాగా, పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 44,172మంది అధికంగా ఉండడం విశేసం.

వచ్చేనెల 28వరకు అభ్యంతరాల స్వీకరణ

ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం విడుదల చేయనుండగా వచ్చే నెల 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అంతేకాక 1జనవరి 2025నాటికి 18ఏళ్లు నిండనున్న యువత ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం నవంబర్ 9, 10వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేస్తారు. అనంతరం అభ్యంతరాలు, కొత్త ఓటర్ల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాక 2025 జనవరి 6వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నారు.

ముసాయిదా జాబితా ఆధారంగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,55,198	1,68,739	49	3,23,986
పాలేరు	1,16,195	1,25,626	07	2,41,828
మధిర	1,07,341	1,15,380	10	2,22,731
వైరా	93,985	1,00,026	04	1,94,015
సత్తుపల్లి	1,18,768	1,25,888	14	2,44,670
మొత్తం	5,91,487	6,35,659	84	12,27,230

ఏచూరి లేకపోతే కూటమే లేదు...

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

బోనకల్/కొణిజర్ల: దివంగత సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి లేకపోతే దేశంలో ఇండియా కూటమి ఏర్పడేదే కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకుని వ్యవహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. బోనకల్ మండలంలోని గోవిందాపురం(ఎల్), కొణిజర్ల మండలం చిన్నమునగాలలో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గోవిందాపురంలో సీపీఎం నాయకుడు ఎర్రబోయిన నాగేశ్వరరావు వర్ధంతి సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ నేతల మాదిరి పనిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయాన ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర హామీలేమీ అమలుచేయకపోగా అప్పులను సాకుగా చూపడం సరికాదన్నారు. కాగా, అప్పులు చేయడంలో బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ పార్టీ మించిపోయిందని తెలిపారు. అలాగే, బీజేపీ మతోన్మాద శక్తిని తట్టుకుని పోరాడే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని తమ్మినేని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, బి.రమేష్, కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు, నారాయణ, వీరభద్రరావు, జొన్నలగడ్డ సునీత, తమ్మారపు లక్ష్మి, కారంగుల చంద్రయ్య, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, తాతా పద్మ, బోయినపల్లి శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, చెరుకుమల్లి కుటుంబరావు, కృష్ణార్జునరావు, చింతపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రత చర్యలు తప్పనిసరి



షాపు నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం లో ఏర్పాటుచేసిన నాని ఫైర్‌వర్క్స్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా నగరానికి సమీపంలో హోల్‌సేల్ షాపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అయితే, బాణాసంచా నిల్వల విషయంలో భద్రత పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తుపాకుల ఎలగొండ స్వామి, రాష్ట్ర విత్తన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్‌తో పాటు యరగర్ల హన్మంతరావు, తుపాకుల రమాదేవి, నారాయణ, సాయిరాం, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పద్మావతికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

వైరా: హైదరాబాద్‌లో ఈనెల 27న రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో వైరా బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన రచ్చకొండ పద్మావతి ప్రథమ బహుమతి సాధించారు. ఈమేరకు పోటీల నిర్వాహకులు, ఆదియోగ పరమేశ్వర యోగా ఫౌండేషన్ కార్యదర్శి కె.రాజశేఖర్ ఆమెకు ప్రశంసా పత్రంతోపాటు బంగారు పతకం అందజేశారు.

'సాయిస్ఫూర్తి'కి జాతీయస్థాయి అవార్డులు



అవార్డులతో ప్రిన్సిపాల్, తదితరులు

సత్తుపల్లి: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయస్థాయి ఎక్సెంట్ అడ్మినిస్ట్రేషన్, క్వాలిటీ ఎడ్యుకేషన్ అండ్ ప్లేస్‌మెంట్ అవార్డులు లభించాయి. ఈ మేరకు ప్రిన్సిపాల్, విభాగాధిపతులను హెటిరో కంపెనీ అధినేత, ఎంపీ, కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషన్ ట్రస్టీ బండి అన్విద పర్చువల్‌గా అభినందించారు. కాగా, అవార్డులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషరత్నకుమారి బెంగళూరులో ఇటీవల అందుకున్నారు. కాగా, కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ దాసరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత 23ఏళ్లుగా విద్య, సామాజిక కార్యక్రమాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డులు లభించాయని తెలిపారు.

పాఠశాలల స్థాయి బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ బాలబాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ఎంపిక పోటీలకు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం జట్ల వివరాలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.నర్సింహమూర్తి ప్రకటించగా, కోచ్ హరీశ్‌తో పాటు పీ.వీ.రమణ, వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

జట్ల వివరాలు..

అండర్-14 బాలుర జట్టుకు వి.మెగావర్షిత్, కె.విష్ణుతేజ, ఎస్.స్వప్నిల్, దీక్షిత్, ఎం.డీ.షాయన్ బేగ్, బాలికల విభాగంలో వి.నిత్య, ఎం.చరితశ్రీ, జె.అవంతిక, పి.రోదగ్రాస్, జి.భావన, కార్తీక ఎంపికయ్యారు. అలాగే, అండర్-17 బాలురలో డి.తేజస్ వివేక్, ఏ.వినయ్, బి.శశ్వ తేజస్, కె.మోహన్‌కృష్ణ, కె.పార్థసారథి, బాలికల జట్టుకు కె.గగన్‌శ్రీ, బి.రిత్వి కశ్రీ, దివ్యశ్రీ, జి.జెస్సీ ఎంపికైనట్లు వెల్లడించారు.

లంకాసాగర్ ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ ప్రాజెక్టులో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చేప సోమవారం చేపపిల్లలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేపపిల్లలు అందిస్తోందని తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కల్లూరు మార్కెట్ చైర్మన్ నీరజా ప్రభాకర్ చౌదరి, వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, మత్స్యసొసైటీ అధ్యక్షుడు నీలాల గోపి, తహసీల్దార్ గంటాప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఓ ఉపేంద్రయ్య, నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, అలుగోజు చిన్నస్వామి, తేళ్ల ఆనందరావు, బాపిరెడ్డి, చీకటి రామారావు పాల్గొన్నారు.

బారులు దీరిన పత్తి వాహనాలు

మార్కెట్ సమీపాన బారులుదీరిన పత్తి వాహనాలు



పత్తి బస్తాలపై సేద తీరుతున్న రైతులు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వివిధ ప్రాంతాల రైతులు సోమవారం భారీగా పత్తి తీసుకొచ్చారు. వందలాదిగా వాహనాలు రావడంతో ఆవరణలోకి పంపించే క్రమాన యార్డు వెలుపల రహదారుల వెంట బారులు దీరాయి. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు సోమవారం అత్యధికంగా 35 వేల బస్తాల పత్తి వచ్చిందని అధికారులు అంచనా వేశారు. అయితే, భారీగా పత్తి వచ్చిన నేపథ్యాన కాంటాలు ఆలస్యం కావడంతో బస్తాలపైనే కూర్చుని రైతులు నిరీక్షించడం కనిపించింది. – ఖమ్మం వ్యవసాయం

బ్యాంక్ లింకేజీల్లో కొత్త చిక్కులు

- సంఘంలో ఒకరు రుణం చెల్లించకున్నా ఖాతాలన్నీ బ్లాక్
- లబోదిబోమంటున్న మహిళా సంఘాల సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళ సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల నిబంధనలు కొత్త చిక్కు తీసుకొచ్చి పెడుతున్నాయి. మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు మంజూరు చేయిస్తోంది. అయితే రుణాల చెల్లింపుల్లో ఒకరిద్దరు సభ్యులు జాప్యం చేసినా బ్యాంకర్లు అందరి ఖాతాలను బ్లాక్‌లో పెడుతున్నారు. దీంతో సక్రమంగా రుణాలు చెల్లించే సభ్యులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఏం చేయాలి సార్?

ఖమ్మం 24వ డివిజన్‌కు చెందిన ఓ మహిళా సంఘానికి ఓ బ్యాంక్ నుండి రూ.20 లక్షల రుణం మంజూరైంది. అయితే, సంఘంలోని ముగ్గురు సభ్యులు తమ వాటా వదులుకోవడంతో అందులోని మరో సభ్యురాలు వారి వాటా తీసుకుంది. కానీ ఆమె రెండు నెలలుగా ఆమె కిస్తీలు చెల్లించకపోవడంతో సంఘం ఖాతాతో పాటు మిగగా వారి వ్యక్తిగత ఖాతాలను బ్లాక్ చేశారు. ఈమేరకు సభ్యులు బ్యాంకులో సంప్రదిస్తే విషయం బయటపడింది. దీంతో సభ్యులు సోమవారం కేఎంసీ కార్యాలయంలో మెప్మా అధికారులను కలవగా పదిహేను రోజుల గడువులోగా రుణం చెల్లించాలని సూచించడమే కాక బ్యాంకర్లతో మాట్లాడారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు నిలిచినట్టేనా?

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంపై పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు దస్త్రంపై అధికారులు సంతకం చేయలేదని తెలుస్తోంది. కేటగిరీల వారీగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల పెంపు, బయోమెట్రిక్ హాజరు విషయంలో స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో అధికారులు ఫైల్‌ను పక్కన పెట్టినట్లు సమాచారం. ఈ విషయమై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను వివరణ కోరగా బయోమెట్రిక్ హాజరు వివరాలను జత చేయకపోవడంతో పరిశీలిస్తున్నామని, పండుగ వరకు సిబ్బందికి వేతనాలు అందిస్తామని తెలిపారు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసరావు

ఖమ్మంవైద్యవిభాగం/తిరుమలాయపాలెం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఐఎంఏ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఆయనకు స్థానం దక్కింది. కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన శ్రీనివాసరావు 1999లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా చేరి ఆర్థో స్పెషలిస్ట్‌గా సేవలందించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్‌ఎంఓగా విధులు నిర్వహించిన ఆయన ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. ప్రస్తుతం శ్రీనివాసరావు తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈసందర్భంగా ఆయనను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ కె.ప్రసాద్ రావు, ఐఎంఏ బాధ్యులు, వైద్యులు ఎలమంచిలి రవీంద్రనాథ్, గురునాథం, గోంగూర వెంకటేశ్వర్లు, కంభంపాటి నారాయణరావు, జగదీష్, రెహానా బేగం తదితరులు అభినందించారు. అలాగే, తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో సన్మానించగా వైద్యులు కృపాఉషశ్రీ, మదన్ సింగ్, ప్రతాపరెడ్డి, ఉద్యోగులు సత్యప్రసాద్, కుమారి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం, డీఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఆర్టీసీ రీజియన్‌లో ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సలహాలు స్వీకరించేందుకు ఆర్టీసీ మంగళవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రీజియన్ స్థాయిలో సలహాలు, సమస్యలపై ఉదయం 11నుండి 12 గంటల వరకు 99592 25953 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే, ఖమ్మం డిపో పరిధిలో సమస్యలను తెలుసుకునేందుకు సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు జరిగే డయల్ డీఎంలో భాగంగా 99592 25958 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

బోనకల్ రైతు వేదికకు తాళం



రైతువేదికకు తాళం వేస్తున్న నాయకులు

బోనకల్: ఇటీవల తుపాన్‌కు దెబ్బతిన్న పంట పొలాలకు సంబంధించి విడుదలైన నష్టపరిహారం జాబితా వెల్లడించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు ఆధ్వర్యాన పారుపల్లి నరసింహారావు డిమాండ్ చేశారు. నష్టపరిహారం జాబితాలో అవకతవకలు జరిగాయని రాపల్లి, బ్రాహ్మణపల్లి, ఆళ్లపాడు, బోనకల్ రైతులు ఇటీవల కలెక్టర్‌తో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యాన నరసింహారావు ఆధ్వర్యాన వివరాలు అరా సేందుకు మండల కేంద్రంలోని రైతువేదిక వద్దకు రాగా ఎవరూ లేకపోవడంతో తాళం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిహారం జాబితాలో అనర్హులను చేర్చి, వాస్తవంగా నష్టపోయిన రైతులను విస్మరించారని ఆరోపించారు. నాయకులు యంగల ఆనంద్‌రావు, తూము రోషన్‌కుమార్, ఉప్పర శ్రీను, గంగుల నాగయ్య, ఏలూరి రమేష్, కొంగర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో హాస్టల్ వార్డెన్ మృతి

కొట్టి చంపారని కుటుంబసభ్యుల ఆందోళన



రాజేష్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని గోపాలపురం సమీపాన ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్న భూక్యా రాజేష్(21) సోమవారం మృతి చెందాడు. అయితే, ఆయనను విద్యాసంస్థ బాధ్యులే కొట్టి చంపారని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. రెండు గంటల పాటు సాగిన ఆందోళనతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సీఐ భాస్‌ప్రకాష్, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు... ఏన్కూరు మండలం రాంనగర్ తండాకు చెందిన రాజేష్ సదరు పాఠశాల హాస్టల్‌లో నాలుగు నెలలుగా వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా, సోమవారం ఆయన రోడ్డు పక్కన మృతదేహమై ఉండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మార్చురీకి తరలించారు. కాగా, అక్కడకు చేరుకున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు మాట్లాడుతూ రాజేష్ మృతదేహంపై గాయాలు ఉన్నాయని, తాము వచ్చేలోగా మృతదేహాన్ని ఎందుకు తరలించారని ప్రశ్నించారు. ఘటనకు విద్యాసంస్థ యాజమాన్యం సమాధానం చెప్పాలనే డిమాండ్‌తో గేట్ వద్ద ఆందోళన చేపట్టడమే కాక లోనకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వీరికి సీపీఐతో పాటు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలపగా ఎస్ఐ శ్రీనివాస్ నచ్చచెప్పారు. అనంతరం రాజేష్ తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

కార్పొరేటర్ జగన్ మృతి

గుండెపోటుతో కన్నుమూసిన 3వ డివిజన్ కార్పొరేటర్



జగన్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మూడో డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు మలీదు జగన్మోహన్‌రావు(జగన్) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన ఖమ్మంలోని నివాసంలో గుండెపోటుతో స్పృహ తప్పి పడిపోగా కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగానే జగన్‌సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య నాగమణి, కుమారులు ప్రణీత్, మణీత్ ఉన్నారు. కుమారులు అమెరికా, న్యూజిల్యాండ్‌లో చదువుతుండగా వారు ఇక్కడకు చేరుకున్నాక అంత్యక్రియలు నిర్వహిస్తారు.


నివాళులర్పించిన మంత్రి

కార్పొరేటర్ జగన్ మృతి సమాచారం తెలియగానే ఖమ్మంలో ఉన్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ వెళ్లి ఆస్పత్రిలో జగన్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఈక్రమంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పాటుపడే ఆయన మృతితో కష్టపడే నాయకుడుని కాంగ్రెస్ కోల్పోయిందని తెలిపారు. అలాగే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా కార్పొరేటర్ మృతిపై సంతాపం ప్రకటించారు. కాగా, కేఎంసీ ఎన్నికల్లో జగన్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. తొలి నుండి ఆయన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅనుచరుడిగా కొనసాగుతుండగా, ఆయన భార్య నాగమణి గతంలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసినా ఓడిపోయారు.



జగన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఆటోని ఢీకొట్టిన కంటైనర్.. ఒకరు మృతి



విజయరావు (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని ఖమ్మం-ఇల్లెందు ప్రధానరోడ్డుపై సోమవారం ఆటోను కంటైనర్ ఢీకొట్టడంతో ఆటో నడుపుతున్న గార్లపాటి విజయరావు(24) అక్కడిక్కడే మృతి చెందగా సతీష్ గాయపడ్డాడు. కేటీఆర్ కాలనీ – శివాయిగూడెం మధ్య జరిగిన ఈ ప్రమాదంపై సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాలు... రఘునాథపాలెం మండలం శివాయిగూడెంకు చెందిన విజయరావు, సతీష్ ఆటోలో ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయరావు లారీ ముందు టైర్ కింద పడి మృతి చెందాడు. సతీష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బంధువుల కర్మకాండకు అవసరమైన సరుకులు తెచ్చేందుకు ఖమ్మం వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతుండగా, ఐదు నిమిషాల్లో ఇంటికి చేరతారనగా ప్రమాదం జరగడంతో విజయరావు కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్లు జైలు శిక్ష

సత్తుపల్లిటౌన్: భార్య, అత్తమామలపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సత్తుపల్లి సబ్ జడ్జి ఎస్.కే.మీరాఖాసిం సాహెబ్ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లిలోని అయ్యగారిపేటకు చెందిన తాటినేని ఉమకు ఏడేళ్ల క్రితం పెనుబల్లి మండలం తాళ్లపెంటకు చెందిన కాటినేని శ్రీనుతో వివాహమైంది. తరచుగా అనుమానిస్తూ అదనపు కట్నం కోసం శ్రీను వేధిస్తుండడంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. అయితే, 2017 ఏప్రిల్ 27న రాత్రి తాళ్లపెంట వెళ్లిన శ్రీను ఇనుపరాడ్డుతో ఉమ ఆమె తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. అంతేకాక అడ్డు వచ్చిన అత్తామామలు మారేశ్వరరావు, రాధపై కూడా విచక్షణారహితంగా రాడ్డుతో దాడి చేసి కళ్లల్లో కారం చల్లి పరారయ్యాడు. ఈ ఘటనపై అప్పటి సీఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ నిర్వహించారు. సాక్షులను విచారించిన అనంతరం శ్రీనుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్‌కు కోర్టు కానిస్టేబుల్ సీహెచ్.శ్రావణ్‌రెడ్డి, హోంగార్డు ప్రవీణ్ సహకరించారు.

పాఠశాలలో పాము కలకలం

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం తాచుపాము కలకలం సృష్టించింది. విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కింద ఆడుకునేందుకు వెళ్లిన సమయాన పాము కనిపించడంతో పరుగులు తీశారు. ఈవిషయాన్ని తెలుసుకున్న స్థానికులు పామును హతమార్చారు. ఒకే ఆవరణలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండగా, చుట్టుపక్కల చెత్త పేరుకుపోవడంతో పాములు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపించారు.

భారీ కొండచిలువ హతం

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో కొండ చిలువను స్థానికులు హతమార్చారు. చెన్నారం పీఏసీఎస్ సమీపాన సోమవారం కొండచిలువ కనిపించింది. సుమారు 9అడుగుల పొడవు ఉండడంతో ఆందోళనకు గురైన ప్రజలు దానిని హతమార్చారు.

రోడ్డుప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. నేలకొండపల్లి మండలం చెన్నారానికి చెందిన ఆవుల లక్ష్మీనారాయణ – పద్మ సోమవారం తోడేళ్లగూడెంలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తున్నారు. ఈక్రమాన తల్లంపాడు వద్ద వీరి బైక్‌ను వెనుక నుండి లారీ ఢీకొట్టింది. ఘటనలో పద్మ(50) పైనుండి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయని సీఐ ముష్క రాజు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ముదిగొండ: మండలంలోని వెంకటాపురానికి చెందిన యువకుడు మద్యానికి బానిసై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన దూదిపాళ్ల మహేష్ (28) బార్బర్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయనకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఆదివారం రాత్రి మద్యం మత్తులో తల్లితో గొడవ పడ్డాడు. దీంతో భయపడిన ఆమె వేరే ఇంటికి వెళ్లి సోమవారం ఉదయం వచ్చేసరికి మహేష్ ఉరి వేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఓ.మురళి తెలిపారు.

రైలుకింద పడి మహిళ...

భర్త ఉండగానే మరొకరితో వెళ్లి వచ్చాక ఘటన

ఖమ్మంక్రైం: భర్త, పిల్లలను వదిలేసి మరో వ్యక్తితో వెళ్లిపోయిన మహిళ కొన్నాళ్లకు తిరిగి వచ్చినా తప్పు చేశాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాలు.. రామన్నపేటకు చెందిన తురక రమాదేవి(29)కు భర్త వీరబాబు, ఇద్దరు పిల్లలు ఉండగా, కొన్నాళ్ల క్రితం వీరబాబు అనారోగ్యం పాలయ్యాడు. దీంతో తమతో కూలీ పనులకు వచ్చే మహేష్‌తో రమాదేవి వెళ్లిపోయింది. ఇటీవల వీరబాబు మృతి చెందగా ఆమె తిరిగి ఖమ్మం రాగా, ఇంతలోనే గతంలోనే వివాహమైన మహేష్ ఆయన భార్య వద్దకు వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తాను తప్పు చేసినందున చనిపోతానని ఆదివారం బంధువులకు ఫోన్ చేసి తెలపగా వారు సర్దిచెప్పారు. అయినా సోమవారం వరంగల్ వైపు వెళ్తున్న తమిళనాడు సూపర్‌ఫాస్ట్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో పోలీసులు రమాదేవి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ఉద్యమ చరితను నేటి తరానికి అందిద్దాం



సీపీఐ శతాబ్ది ఉత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న పువ్వాడ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వందేళ్ల ఉద్యమ చరితను నేటి తరానికి అందిస్తూ ఉద్యమం వైపు ఆకర్షించడంతో పాటు కార్యోన్ముఖులను చేయాలని సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల లోగోను సోమవారం ఆయన ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ అనేక ఉద్యమ విజయాలను చవిచూసిందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడిందని తెలిపారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బీ.జీ.క్లెమెంట్, రామ్మూర్తి, రావి శివరామకృష్ణ, రవీంద్రబాబు, మేకల శ్రీను, సుధాకర్, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, మల్లికార్జున్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

ఖమ్మం అర్బన్/ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా తల్లి హుస్సేన్‌బీ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఈమేరకు సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరావు తదితరులు పుట్టకోటలోని నివాసంలో ఆమె మృతదేహం నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. నాయకులు ఎం.డీ.మౌలానా, భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై దారి మళ్లించే యత్నాలు



మాట్లాడుతున్న తాత మధు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లయినా హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని దారి మళ్లించే యత్నాలు చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తున్నారని, ఇందులో భాగంగానే కుటుంబ వేడుకను రేవ్ పార్టీగా చిత్రీకరించారని పేర్కొన్నారు. ఈక్రమంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, నాగచందర్‌రెడ్డి, బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

నేలకొండపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉద్యోగ విరమణ చేసిన అయినాల గోవిందరావు సన్మాన సభ సోమవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలను పెండింగ్‌లో ఉంచడం సరికాదని పేర్కొన్నారు. వీటితో పాటు పెండింగ్ బిల్లులు, కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని కోరారు. అలాగే, ఆరోగ్య కార్డుల ద్వారా అపరిమితమైన వైద్యం అందించాలని, స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకురావాలన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు నెల్లూరి వీరబాబు, రాజశేఖర్, తొర్తి గురవయ్య, అరవింద్‌కుమార్, రాధాకృష్ణ, పురుషోత్తమ్, నవాబ్‌సాహెబ్, రవీందర్, ఏటుకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతు భరోసా అమలుకు ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: రైతు రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేయడంతో పాటు ఈ ఖరీఫ్‌కు రైతు భరోసా నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రైతుల రుణమాఫీ అమలులో విఫలమైందని ఆరోపించారు. అలాగే, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ప్రకటించి ఈ ఖరీఫ్‌లో ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇకనైనా రైతుల రుణాలు మాఫీ చేసి రైతు భరోసానిధులు విడుదల చేయడమే కాక దొడ్డు రకం వడ్లకు కూడా రూ.500 బోనస్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావుతో పాటు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బీ.జీ.క్లెమెంట్, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, రామ్మూర్తి, ఏపూరి రవీంద్రబాబు, యడ్లపల్లి శంకరయ్య, నానబాల రామకృష్ణ, రమేష్, పుచ్చకాయల సుధాకర్, వెంకట నర్సయ్య, కూచిపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని వినతి

ఖమ్మంమామిళ్లగూడెం: ఎర్రుపాలెంలో శాతవాహన, మధిరలో చార్మినార్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన సికింద్రాబాద్‌లో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. ఎర్రుపాలెంలో శాతవాహనకు హాల్టింగ్ ఇవ్వడం ద్వారా సమీపంలోని జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సులువుగా ఉంటుందని తెలిపారు. అలాగే, ఖమ్మం స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై మామిళ్లగూడెం వైపు దారి ఏర్పాటుచేయాలని కోరారు.